క్లుప్తంగా

21న మండల సర్వసభ్య సమావేశం

బాడంగి: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 21వ తేదీన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎస్.రామకృష్ణ ఓ ప్రకటనలో బుధవారం వెల్లడించారు. ఎంపీపీ భోగి గౌరి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో పాటు మండల స్థాయి అధికారులంతా హాజరు కావాలని కోరారు.

100 లీటర్ల బెల్లంఊటల ధ్వంసం



బెల్లంఊటను పారబోస్తున్న సిబ్బంది

బొబ్బిలిరూరల్: మండలంలోని కొయ్యికొండవలస గిరిజన గ్రామంలో సారా తయారీకి సిద్ధం చేసిన 100 లీటర్ల బెల్లంఊటలను ఎక్సైజ్ సిబ్బంది బుధవారం ధ్వంసం చేశారు. సారా బట్టీలపై ఆకస్మిక దాడులు నిర్వహించి, బెల్లం ఊటలు గుర్తించి పారబోశామని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ చిన్నంనాయుడు తెలిపారు. సారా తయారు చేసినా తరలించినా విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గడ్డివాముల దగ్ధం



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

రాజాం: మండలంలోని లక్ష్మీపురంలో బుధవారం జరిగిన అగ్నిప్రమాదంలో గ్రామానికి చెందిన టంకాల అప్పలనాయుడు, అతడి బంధువులకు సంబంధించిన మొత్తం నాలుగు ఎకరాల వరిగడ్డి కుప్పలు(గడ్డివాములు) దగ్ధమయ్యాయి. కళ్లాల్లోని గడ్డికుప్పలు చూడడానికి వెళ్లగా, వాటి నుంచి పొగలు వస్తూ కాలిపోతుండడం చూసిన అప్పలనాయుడు గ్రామస్తులకు సమాచారం ఇచ్చాడు. హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్న గ్రామస్తులు, ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పివేశారు. రూ.20 వేల వరకు ఆస్తినష్టం జరిగినట్లు బాధితుడు తెలిపారు.

పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, డాక్టర్ తలే రాజేష్

రేగిడి: మండలంలోని ఉనుకూరుకు చెందిన మాజీ సర్పంచ్ తెంటు కృష్ణమూర్తినాయుడు ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్.. ఆ గ్రామానికి బుధవారం వెళ్లి, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం కృష్ణమూర్తినాయుడు మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని, ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గేదెల వెంకటేశ్వరరావు, టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన ర్యాలీ



రేగిడిలో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

రేగిడి: మండలంలోని దేవుదళ, పుర్లి, రేగిడి గ్రామాల్లో క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన ర్యాలీ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాధి లక్షణాలు, వ్యాధి బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను పీహెచ్‌సీ వైద్యాధికారి ఆసిరినాయుడు తెలిపారు. కార్యక్రమంలో క్షయవ్యాధి సూపర్‌వైజర్ వేణుగోపాల్, సూపర్‌వైజర్ అప్పారావు పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనపై శిక్షణ

సంతకవిటి/వంగర: మండల పరిషత్ కార్యాలయాల్లో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు గ్రామ పంచాయతీల సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనపై బుధవారం శిక్షణ ఇచ్చారు. గ్రామాల అభివృద్ధి తీసుకోవాల్సిన చర్యలను ఎంపీడీవోలు శిక్షణార్థులకు వివరించారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.

'పొలం పిలుస్తోంది'

బొబ్బిలిరూరల్: మండలంలోని కారాడ గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కజొన్న సాగులో కలుపుమొక్కల నివారణకు ఏడీఏ మజ్జి శ్యామసుందర్ పలు సూచనలు చేశారు. అలాగే తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు ఎలా సాధించాలన్న విషయాన్ని వివరించారు.




వైఎస్సార్ సీపీ హయాంలో నిర్మించిన రామభద్రపురం సచివాలయం, రైతు భరోసా కేంద్రం భవనాలు

నాడు సంక్షేమం.. నేడు వంచన!

- సంక్షేమం ఊసెత్తని చంద్రబాబు ప్రభుత్వం
- 'సూపర్ సిక్స్' కోసం ఆశగా ఎదురుచూస్తున్న జనం
- ఆరు నెలలైనా ఎన్నికల హామీలు అమలు చేయని వైనం
- కూటమి సర్కారు తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు

రామభద్రపురం:



వైఎస్సార్ సీపీ హయాంలో ఐదేళ్లు ప్రతినెలా జరిగిన సంక్షేమ పథకాల అమలుతో పండగ చేసుకున్న ప్రజలకు ప్రస్తుత కూటమి ప్రభుత్వం షాక్‌ల మీద షాక్‌లిస్తోంది. అధికారం చేపట్టి ఆరు నెలలైనా వారిచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో ఏ ఒక్కటీ పూర్తి స్థాయిలో అమలు చేయకపోవడంపై ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రచ్చబండలు, కిరాణా షాపులు, టీ దుకాణాల వద్ద ఒకటే చర్చ.. చంద్రబాబు ప్రభుత్వం ఇంకెప్పుడు సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని? జగనే సీఎం..గా ఉంటే నెలకో పథకం వచ్చి ఉండేదని, పిల్లాపాపలతో అందరం పండగ బాగా చేసుకునేవాళ్లమని అనుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి, పింఛన్ల నగదు మాత్రమే పంపిణీ చేస్తున్నారని, మరోవైపు చాలా మంది పింఛన్లు తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏడాదికి ఇంటికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని చెప్పి, వాటిని కూడా అరకొరగానే సరఫరా చేస్తున్నారని, చాలామందికి గ్యాస్ సిలిండర్ల డబ్బులు కూడా పడడం లేదని చెబుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో పెట్టే వారిని దూరం చేసుకుని, కొట్టే వారిని తెచ్చుకున్నామని బాహాటంగానే విమర్శిస్తున్నారు.

గతంలో రూ.600 కోట్లతో సంక్షేమాభివృద్ధి..

గతంలోని జగనన్న ప్రభుత్వంలో 2019 నుంచి 2024 వరకు మండలంలో రూ.600 కోట్లతో సంక్షేమాభివృద్ధి జరిగింది. మండల వ్యాప్తంగా 17 గ్రామ సచివాలయాల పరిధిలోని ప్రజలకు వివిధ సంక్షేమ పథకాలు అందించడంతో పాటు ప్రతీ గ్రామంలో మౌలిక సదుపాయాలు ఉండేలా, ప్రజల వద్దకు ప్రభుత్వ సేవలు అందేలా అభివృద్ధి పనులు చేశారు. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్‌ల భవన నిర్మాణాలతో పాటు నాడు–నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలలను అందంగా తీర్చిదిద్దడం, తాగునీరు, సీసీ రోడ్లు, విద్యుత్ వంటి మౌలిక వసతులు ఏర్పాటు చేయడం వంటివి చేపట్టారు. వీటికి తోడు ప్రతీ వర్గానికి మేలు జరిగేలా సంక్షేమ పథకాలు రూపొందించి, అమలు చేశారు. తద్వారా ప్రతిఒక్కరూ లబ్ధి పొందారు. కోవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లో సంక్షేమ పథకాల డబ్బులు ప్రజల చేతిలో ఉండబట్టే ఆర్థిక ఇబ్బందులు అంతగా అనిపించలేదన్న అభిప్రాయం ప్రజలే వ్యక్తపరుస్తుండడం విశేషం. కూటమి నేతల మాయమాటలు నమ్మి మోసపోయామని మొత్రోమంటున్నారు.

హామీలు అమలు చేయాలి..



కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలి. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇచ్చినట్లే పారదర్శకంగా పథకాలు ఇవ్వాలి. నేడు పింఛన్ డబ్బులు తప్ప మరేమీ రావడం లేదు. ఎన్నికల సమయంలో ఇస్తానన్న సూపర్ సిక్స్ పథకాలు ఇచ్చి, ప్రజలను ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కించాలి.

– చొక్కాపు లక్ష్మణరావు, ఎంపీపీ, రామభద్రపురం

నిరుపేదలు ఇబ్బంది పడుతున్నారు..



సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడంతో నిరుపేదలంతా ఇబ్బంది పడుతున్నారు. జగన్ మోహన్‌రెడ్డి హయాంలో అమలు చేసిన ఏ ఒక్క పథకమూ ఇప్పుడు లేదు. కనీసం కూటమి ప్రభుత్వం ఇస్తానన్న పథకాలు కూడా ఇవ్వడం లేదు. ప్రస్తుత ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైంది. ఇప్పటికైనా ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి.

– అప్పికొండ సరస్వతి, జెడ్పీటీసీ, రామభద్రపురం

ప్రజలు పశ్చాత్తాప పడుతున్నారు..



కూటమి నేతల మాయమాటలు నమ్మి, మోసపోయామని ప్రజలంతా అనుకుంటున్నారు. ప్రజలకు మంచి చేసిన జగన్‌ను వదులుకుని తప్పు చేశామని పశ్చాత్తాప పడుతున్నారు. జగనన్న ఉంటే బాగుండేదనే మాట.. ఇప్పుడు అందరి నోటా వినిపిస్తోంది.

– శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, మాజీ ఎమ్మెల్యే, బొబ్బిలి

ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్, డాక్టర్ తలే రాజేష్

- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్

రేగిడి: ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వ విఫలమైందని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ విమర్శించారు. ఇదే విషయమై వారు మండల కేంద్రంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం కొనుగోలు సక్రమంగా జరగకపోవడంతో రైతులు దళారులను ఆశ్రయించి, మోసపోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు ట్రక్ షీట్లు ఇవ్వడం జరిగిందని, వాటి ఆధారంగా కేటాయించిన కొనుగోలు కేంద్రాలకు రైతులు ధాన్యం తరలించి విక్రయించేవారని గుర్తు చేశారు. అప్పట్లో ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాల్లోకి ఎప్పటికప్పుడు నగదు కూడా జమ అయ్యేదన్నారు. ప్రస్తుతం అటువంటి విధానాలు లేకపోవడంతో మిల్లర్లకు కలిసివస్తోందని, వారికి నచ్చితేనే ధాన్యం కొనుగోలు చేస్తున్నారని లేకపోతే వదిలేస్తున్నారన్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను విక్రయించేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారన్నారు. రైతులకు మేలు జరగకపోతే వారు కన్నెర్ర చేసే కాలం దగ్గరలోనే ఉందన్నారు. ఇప్పటికైనా రైతులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి మాజీ అధ్యక్షుడు గేదెల వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

రౌండ్ టేబుల్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ

బొబ్బిలి: స్థానిక గంటి ప్రసాదం స్మారక భవనంలో రౌండ్ టేబుల్ సమావేశం బుధవారం నిర్వహించారు. రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మర్రాపు సూర్యనారాయణ మాట్లాడుతూ రైతుల వద్ద నుంచి సేకరిస్తున్న పాల ధరలు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం ఇదే విషయమై ఎమ్మెల్యే బేబీ నాయనకు వినతిపత్రం అందజేశారు. సమావేశంలో పాల రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎల్.ఆదినారాయణమూర్తి, రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.గోపాలం, బి.రాంబాబు, రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేమిరెడ్డి లక్ష్మంనాయుడు తదితరులు పాల్గొన్నారు.


నకిలీ ఇళ్లపట్టాలపై దర్యాప్తు చేయాలి

బొబ్బిలి: పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో నకిలీ ఇళ్ల పట్టాల వ్యవహారంపై దర్యాప్తు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కోట అప్పన్న డిమాండ్ చేశారు. ఇదే విషయమై స్థానిక పట్టణంలోని బలిజిపేట రోడ్డులో బుధవారం ఆందోళన చేపట్టారు. నకిలీ ఇళ్లపట్టాలు తయారు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇదే విషయమై కలెక్టరేట్‌లో కూడా ఫిర్యాదు చేసినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి మునకాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వంద రోజుల పనిదినాలు కల్పించాలి

రాజాం సిటీ: ఉపాధి హామీ పథకం వేతనదారులకు వంద రోజుల పనిదినాలు కల్పించాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ పథకం సిబ్బందితో బుధవారం సమావేశమైన ఆయన.. ప్రతీ గ్రామంలో ఉపాధి పనులు జరిగేలా చూడాలని, కొలతల ప్రకారం పనులు చేయించి, గిట్టుబాటు అయ్యే వేతనం వచ్చేలా చూడాలని తెలిపారు. గోకులాలు, పల్లెపండగ పనులు, సోషల్ ఆడిట్ వివరాలకు సంబంధించిన బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు.

వీరజవాన్ల కుటుంబాలకు ఆర్థికసాయం



బొబ్బిలి: ఆర్థికసాయం అందజేస్తున్న సైనిక సంక్షేమ డైరెక్టర్ వెంకటరెడ్డి

బొబ్బిలి: మండలంలోని సీహెచ్ బొడ్డవలస గ్రామం సహా బాడంగి మండలంలోని బొత్సవానివలస గ్రామంలో వీరజవాన్ల కుటుంబాలకు సైనిక సంక్షేమ డైరెక్టర్ వి.వెంకటరెడ్డి ఆర్థికసాయం అందజేశారు. బొడ్డవలసకు చెందిన నాయక్ తేలు దినేష్, బొత్సవానివలసకు చెందిన గొట్టాపు శంకరరావుల కుటుంబ సభ్యులను ఆయన బుధవారం పరామర్శించి, ఒక్కో కుటుంబానికి రూ.50 వేల చొప్పున అందజేశారు. అనంతరం సైనిక సంక్షేమ కార్యాలయం నుంచి రావాల్సిన ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో సైనిక సంక్షేమ అధికారి మజ్జి కృష్ణారావు, మాజీ అసిస్టెంట్ డైరెక్టర్ రాజారావు, జిల్లా సైనిక సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు సబ్బాన సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: తెర్లాం మండలంలోని బూరిపేట, బొబ్బిలి మండలంలోని కోమటిపల్లి, రామభద్రపురం మండలంలోని కొండకెంగువ, బొబ్బిలి పట్టణానికి చెందిన పలువురికి మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే బేబీ నాయన బుధవారం అందజేశారు.

వినతుల వెల్లువ

ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రామ గ్రామాన నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులకు వినతులు వెల్లువెత్తుతున్నాయి. భూ సరిహద్దు, విస్తీర్ణం, మ్యుటేషన్ సమస్యలు సహా రైతుల మధ్య నెలకొన్న భూ తగాదాలు, వివిధ ధ్రువపత్రాలకు సంబంధించి ప్రజల నుంచి అధికారులు వినతిపత్రాలు స్వీకరించారు. 40 రోజుల్లోగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

– బొబ్బిలి, రాజాం నెట్‌వర్క్



తెర్లాం: సతివాడలో రైతులనుద్దేశించి మాట్లాడుతున్న తహసీల్దారు హేమంత్‌కుమార్



బాడంగి: డొంకినవలస గ్రామ రెవెన్యూ సదస్సులో సమస్యలపై నిలదీస్తున్న రైతు



రామభద్రపురం: అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దారు సులోచనరాణి



రేగిడి: సంకిలిలో వినతిపత్రం అందిస్తున్న నీటి సంఘం అధ్యక్షుడు జనార్దనరావు

● కుళాయి కనెక్షన్ కట్



బొబ్బిలి మున్సిపాలిటీ పరిధిలో పన్నులు చెల్లించని పలువురి ఇంటి కుళాయి కనెక్షన్లు బుధవారం తొలగించారు. మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి ఆదేశాల మేరకు ఇంటి పన్ను సహా నీటి పన్ను చెల్లించని వారి ఇళ్ల వద్దకు సిబ్బంది వెళ్లి, కుళాయి కనెక్షన్లు కట్ చేశారు. పన్నులు చెల్లించినట్లు రశీదులు చూపిస్తేనే మళ్లీ కుళాయి కనెక్షన్లు పునరుద్ధరిస్తామని స్పష్టం చేశారు. –బొబ్బిలి

● ఇది వాగు కాదు.. రోడ్డు..



ఈ చిత్రంలోనిది అచ్చం వాగులా కనిపిస్తున్నా.. వాగు కాదు.. అది రోడ్డు.. రాజాంలోని పాలకొండ రోడ్డులో పొనుగుటివలస జంక్షన్ దగ్గరి రోడ్డు ఇది. రోడ్డు విస్తరణ పనులు చేస్తుండగా, రేగిడి మండలంలోని సంకిలి నాగావళి నది నుంచి రాజాం మున్సిపాలిటీకి తాగునీరందించే ఇక్కడి ప్రధాన పైపులైన్‌కు రంధ్రం పడడంతో ఆ నీరంతా ఇలా రోడ్డుపైకి వచ్చి చేరుతోంది. దీంతో అటువైపుగా రాకపోకలు సాగించే జనం అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. స్పందించిన ఏఈ వెంకట్.. ప్రజల ప్రయాణానికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. – రాజాం సిటీ

● మొరాయించిన ఆర్టీసీ బస్సు



రాజాం నుంచి కొప్పర గ్రామం వైపు బుధవారం వెళ్తున్న ఆర్టీసీ బస్సు మొరాయించింది. అరసాడ సమీపానికి వచ్చేసరికి మరమ్మతులకు గురికావడంతో బస్సు ఆగిపోయింది. దీంతో అందులోని ప్రయాణీకులంతా కిందికి దిగి, కొంతదూరం వరకు బస్సును నెట్టారు. ఆ తర్వాత బస్సు స్టార్ట్ కావడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. సురక్షితంగా తమ గమ్యం చేరుకున్నారు. – వంగర

ఏటీఎం మార్చేసి రూ.2.17 లక్షలు విత్‌డ్రా

- బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు

సంతకవిటి: ఏటీఎం మోసంపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆర్.గోపాలరావు బుధవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. ఈ నెల 4వ తేదీన సంతకవిటి మండలం, గడిముడిదాం గ్రామానికి చెందిన లావేటి రాజగోపాలనాయుడు తన అమ్మ పెన్షన్ డబ్బులు విత్‌డ్రా చేసి, అందివ్వాలని అదే గ్రామానికి చెందిన ఏగిరెడ్డి మోహన్‌రావుకు ఏటీఎం కార్డు ఇచ్చాడు. మండల పరిధిలోని రాజాం సమీపంలో ఉన్న డోలపేట ఎస్‌బీఐ ఏటీఎం వద్దకు మోహన్‌రావు వెళ్లి, అక్కడి మరో వ్యక్తికి డబ్బులు విత్‌డ్రా చేసి, ఇవ్వాలని తన వద్ద కార్డు ఇచ్చాడు. ఆ వ్యక్తి రూ.10 వేలు విత్‌డ్రా చేసి, మోహన్‌రావు ఇచ్చిన కార్డుకు బదులు అతడి కార్డు ఇచ్చాడు. అక్కడి నుంచి మోహన్‌రావు వెళ్లిన తర్వాత దగ్గర నుంచి ఆ వ్యక్తి పలు దఫాలుగా మొత్తం రూ.2.17 లక్షల విత్‌డ్రా చేసినట్లు బాధితుడు పోలీసుల వద్ద వాపోయాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



ఎంపీడీవో సురేష్‌కుమార్‌ను కలిసిన కొత్త కార్యవర్గ సభ్యులు

సంతకవిటి: మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గం ఎన్నిక బుధవారం జరిగింది. అధ్యక్షుడిగా వై.మణికుమార్, ఉపాధ్యక్షులుగా ఐ.మోహనరావు, పి.కృష్ణ, సమాచార కార్యదర్శులుగా ఎస్.రామారావు, జి.రామారావు, ఎస్.మాధవి, ప్రధాన కార్యదర్శిగా ఎస్.నరేష్, సహాయ కార్యదర్శులుగా ఎం.ధనలక్ష్మి, వి.శ్వేత, కోశాధికారిగా ఇ.శంకరరావు, కె.దిలీప్‌కుమార్, ఉప కోశాధికారిగా ఎ.అనూష, ఎస్.వేణునాయుడు ఎంపికయ్యారు. అనంతరం ఎంపీడీవో కె.సురేష్‌కుమార్‌ను కొత్త కార్యవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు.

అప్రమత్తంగా ఉండాలి



రేగిడి: తునివాడలో నూర్పిడి చేసిన ధాన్యాన్ని బస్తాల్లో నింపి భద్రపరుస్తున్న దృశ్యం



రాజాం సిటీ: కంచరాం వద్ద రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో రేణుకాసాయి

రాజాం/రాజాం సిటీ/రేగిడి: తుపాను వర్షాల నేపథ్యంలో రైతులంతా అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. పొలాల్లో కోసిన వరిచేను పాడవ్వకుండా జాగ్రత్త వహించాలని చెబుతున్నారు. అలాగే కళ్లాల్లో నూర్పిడి చేసిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాలంటున్నారు. పొలాల్లోనే కుప్పలుగా వేసిన వరిచేనుపై వర్షం నుంచి రక్షణగా టార్పాలిన్లు కప్పాలన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

రాజాం: పట్టణంలోని మెంతిపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఎంఈవో యాగాటి దుర్గారావు బుధవారం సందర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరుతో పాటు సిబ్బంది పనితీరు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పరిశీలించి, పలు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థుల కోసం సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనం తనిఖీ చేసి, రుచి, శుచికరమైన భోజనం పిల్లలకు అందివ్వాలని ఆదేశించారు.